క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశాలతో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. రానున్న లోకల్ బాడీస్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. అందులో భాగంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి వసతుల కల్పన చేస్తున్నట్లు చెప్పారు.

ముమ్మరంగా డేటా ఎంట్రీ



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ముమ్మరంగా జరుగుతోంది. గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లా పరిశీలించి కంప్యూటర్ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. మండలంలోని 10,200 కుటుంబాలు ఉండగా వందశాతం ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సర్వే పత్రాలను గ్రామాల వారీగా ట్రంక్ పెట్టెల్లో భద్రపర్చనున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వంటలను పరిశీలిస్తున్న ఎంపీఓ

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మగ్దుంపూర్, దొంతి, ఎదుల్లాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, చిన్నారులకు అందిస్తున్న భోజనం పరిశీలించి టీచర్లు పలు సూచనలు చేశారు. చిన్నారులకు, గర్భిణులకు అందించే పోషకాహారం మెనూ ప్రకారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు అలీ, రాఘవేంద్ర భట్టాచార్యులు, తదితరులు ఉన్నారు.

బెల్లం, అంబలి అందజేత



నందగోకుల్‌లో విద్యార్థులకు అంబలి అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బెల్లం, అంబలి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థులకు బెల్లం, అంబలి అందించడంతో పోషకాలు లభించి రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్, దశరథం పాల్గొన్నారు.

వేధింపులను ధైర్యంగా చెప్పాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థినులు తమపై వేధింపులు జరిగితే నిర్భయంగా ముందుకు వచ్చి షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి అన్నారు. గురువారం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో షీ టీమ్ సేవల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినులపై ఎవరైన అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీమ్ దృష్టికి తీసుకొచ్చి రక్షణ పొందలన్నారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. దీంతో పాటు గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, అనర్థాల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం, హెడ్ కానిస్టేబుల్ దేవాదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడుకుందాం

జిల్లాలోని ఆయా గ్రామాల్లో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. పంటలసాగు విధానంలో సేంద్రియ వ్యవసాయంతో భూసారాన్ని కాపాడుకుందామని తెలిపారు. రసాయన ఎరువులు, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. అనంతరం వ్యవసాయ పొలాలను సందర్శించి, రైతులకు సాగు పద్ధతులపై పలు సూచనలు చేశారు. దుక్కిదున్నే సమయంలో వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే దున్నివేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసి భూ సంరక్షణకు సహకరించాలని సూచించారు.



నర్సాపూర్ రూరల్: మట్టిపై అవగాహన కల్పిస్తున్న డివిజన్ వ్యవసాయ అధికారి సంధ్యారాణి



నిజాంపేటలో అవగాహన కల్పిస్తున్న ఏఓ



శివ్వంపేటలో ..



చేగుంట(తూప్రాన్): రుక్మాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి విజ్ఞానజ్యోతిలో విద్యార్థులు గీసిన చిత్రాల పరిశీలిన



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాలో ..



పెద్దశంకరంపేటలో..



వెల్దుర్తిలో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతువేదికలో ..

అడవుల రక్షణపై విద్యార్థులకు అవగాహన

చేగుంట(తూప్రాన్): అడవుల రక్షణ అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు పొలంపల్లి ఫారెస్ట్‌లో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అంబర్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రజాపాలన వనదర్శిని కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అడవుల రక్షణపై వివరించారు. అడవులను కాపాడుకోవడానికి చేపట్టాల్సిన చర్యలను గురించి వివరించి అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే నివారించే పద్ధతలు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ కిరణ్, బీట్ ఆఫీసర్లు రవి, మమత తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణను వివరిస్తున్న అటవీశాఖ అధికారులు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

టీజీసీపీఎస్ఈయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీజీసీపీఎస్ ఈయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వెల్మకన్న పాఠశాలలో సీపీఎస్ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌తో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఉద్యోగుల జీవితంలో ఆర్థిక భద్రత లేదన్నారు. సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులకు పదవీ విరమణ పొందిన తర్వాత కనీసం ఆసరా పింఛన్ వచ్చినంత డబ్బులు కూడా రావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీపీఎస్ కరపత్రం ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని చెర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వర్దవానిచెరువు తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో జగదాంబ, సంత్ సేవాలాల్ విగ్రహాలను ప్రాణప్రతిష్ఠ చేశారు. రెండు రోజులుగా ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించి, గురువారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. బంజారాజాతిని సన్మార్గంలో నడిపిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి మండలంలోని ధర్మారం, కుకునూర్ గ్రామాల్లోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రీతిమహేందర్‌రెడ్డి, మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా భరత్

పాపన్నపేట(మెదక్): మెదక్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భరత్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గంలో యువతను చైతన్య పర్చేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను గ్రామాల్లోకి చేరవేయాల్సిన బాధ్యత యువకులదే నన్నారు. పని తీరును బట్టి పదవులు వరిస్తాయని చెప్పారు. త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో యువత క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు.

మనోహరాబాద్ యూత్ మండలాధ్యక్షుడిగా నవీన్

మనోహరాబాద్(తూప్రాన్): యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఇందిరమ్మ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పారిజాతం నవీన్‌ను, యూత్ ఉపాధ్యక్షుడు యాదగిరిని సన్మానించారు.

ఎంజేపీ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను గురువారం ఆర్డీవో రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వసతుల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యతమైన విద్యతో పాటు భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీవో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నీటి వృథాను అరికట్టాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ ఉన్నంతసేపు మోటార్ నడుస్తుండడంతో నీరు వృథాగా పోతున్నాయి. మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలోని పలు కాలనీలకు మిషన్ భగీరథ నీరు రావడంలేదు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న మినీ ట్యాంకులోని బోరుబావి నుంచి నీరు సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ఉన్నంతసేపు నీరు వస్తున్నప్పటికీ అవసరాలు తీరాక మోటార్ బంద్ చేయకపోవడంతో నీరు వృథాగా పోతోంది. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి మైపాల్ దృష్టికి తీసుకెళ్లగా, నీటి వినియోగం అనంతరం బోరు మోటార్ బంద్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మినీట్యాంకు నుంచి వృథాగా పోతున్ననీరు

అక్రమ అరెస్టులు సహించం

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

పాపన్నపేట(మెదక్): అక్రమ అరెస్టులను సహించమని బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల నాయకులతో కలసి ఏడుపాయల కమాన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ గొంతుక, మాజీ మంత్రి హరీశ్‌రావుపై చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి తప్పుడు ఫిర్యాదులు చేస్తే, అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్నాథం, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, మాజీ జెడ్పీటీసీ అంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానిక్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, వెంకటేశం, కిష్టయ్య పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అరస్టులా?

శివ్వంపేట(నర్సాపూర్): మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ అరెస్టుపై మండల బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మహేశ్‌గుప్తా, మెంబర్ మన్సూర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రగౌడ్ అన్నారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్ట్ చేయడం అక్రమమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులకు ఉద్యమాలు, అరెస్టులు కొత్త కాదన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వామి, మాజీ ఎంపీపీ సంపత్, గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తిర్మల్, రాములు, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో..

నార్సింగి జాతీయ రహదారిపై రాస్తారోకో

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నిప్పుపెట్టేందుకు ప్రయత్నించగా, గమనించిన పోలీసులు అడ్డుకొని చిత్రపటం లాగేశారు. కార్యక్రమంలో నార్సింగి మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సబిత, కృష్ణారెడ్డి, పట్టణాధ్యక్షుడు విష్ణురెడ్డి, బాషా, సక్రూనాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ త్వరగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన తహసీల్దార్ ముసాద్దిక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ ఏ,బీ, సీ,డీ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వ నియామకాలు చేయకూడదన్నారు. అంబేడ్కర్ అభయ హస్తం నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ. 4 వేల పింఛర్లు ఇవ్వాలని, అసైన్‌మెంట్ భూములకు సంపూర్ణ పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంజీవులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, డప్పు మల్లేశం, మాణయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామీణ క్రీడాకారులు సీఎం కప్ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ కోరారు. గురువారం నార్సింగి ఎంపీపీ కార్యాయలంలో మండల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం, శనివారం గ్రామాల్లో, 10, 12న మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ కరీం, పాఠశాల హెచ్‌ఎం, పీడీలు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలు, పీడీలతో ఎంపీడీఓ ఆనంద్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం పోటీల్లో విద్యార్థులు, ఆయా గ్రామాల యువకులు పాల్గొనేందుకు కృషి చేయాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, యువకులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు పంచాయతీ కార్యదర్శులను, పాఠశాల హెచ్‌ఎంలను సంప్రదించాలన్నారు. తహసీల్దార్ ముసాద్దిక్, ఎస్‌ఐ నర్సింహులు, పాల్గొన్నారు.



చిలప్‌చెడ్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సంక్షిప్త వార్తలు

◆ గ్రామదేవతలకు ఘనంగా బోనాలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని రాందాస్‌గూడ గ్రామస్తులు గురువారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామ దేవతల మూడో ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం గ్రామస్తులు బోనాలను డప్పుచప్పుళ్లతో, పోతురాజుల విన్యాసాలతో ఊరేగించారు. అనంతరం మహిళలు బోనాలను గ్రామ దేవతలకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు మధుసూదన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ పథకాలపై కళాజాత

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో గురువారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం కళాకారులు కళాజాత నిర్వహిచారు. పాటలు పాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ సిద్ధులు, రామారావు, కృష్ణ, ఎల్లయ్య, శేఖర్, నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని భాగీరథపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, సిద్దిరాములు, రాజు, శంకర్ ఉన్నారు.

◆ 7న రాష్ట్ర బంద్

నర్సాపూర్: ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని శనివారం చేసే రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. గురువారం ఆయన పలువురు ఆటో డ్రైవర్ల సంఘం నాయకులతో కలిసి బంద్ కరపత్రం విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారిని మోసం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆయా వర్గాల ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు.

◆ నేడు గౌడ హక్కుల సమితి సమావేశం

నర్సాపూర్: ఉమ్మడి మెదక్ జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి సమావేశం శుక్రవారం కౌడిపల్లిలో ఏర్పాటు చేశామని పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్ తెలిపారు.

◆ కేజీబీవీ పరిశీలన



అల్లాదుర్గం(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాలతో మండలంలోని కేజీబీవీని బీఆర్‌ఎస్‌వీ నాయకులు సందర్శించారు. కస్తూర్బా గాంధీ బాలికా సంక్షేమ హాస్టల్లో నాణ్యమైన భోజనం, డ్రింకింగ్ వాటర్ విద్యార్థులకు అందుతున్నాయా అని తెలుసుకున్నారు. ఇందులో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాజిమ్ పటేల్, అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరాజ్, అల్లదుర్గ మండలాధ్యక్షుడు నర్సింలు, కృష్ణ మరవెల్లి, బీఆర్‌ఎస్వీ నాయకులు కార్తీక్, లతీఫ్, సాయి, పటేల్, దశరథ్ పాల్గొన్నారు.

◆ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి

దుబ్బాకటౌన్: నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. దుబ్బాకలోని 15, 18వ వార్డులలో డ్రైనేజీల నిర్మాణ, మరమ్మతుల పనులను గురువారం ఆ పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ వార్డులో డ్రైనేజీపై స్లాబువేసి నెల రోజులు పూర్తి కాకముందే కంకర తేలిన దుస్థితి ఏర్పడిందన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా లక్షల రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం కనీస పరిశీలన కూడా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో భాస్కర్, రాజు, మల్లేశం, తదితరులున్నారు.